క్లుప్తంగా

మట్టి తవ్విన ప్రాంతంలో చట్రుతో పూడ్చివేత

కొవ్వూరు: పట్టణంలో దండగుంటరేవు-2 ఇసుక ర్యాంపు సమీపంలో మట్టి తవ్విన ప్రదేశాన్ని తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమీప రైతులను విచారించగా లూజ్ సాయిల్‌ను తొలగించినట్టు తెలిపారన్నారు. మట్టి తొలగించిన ప్రదేశంలో క్వారీ చట్రుతో పూడ్చి వేసినట్టు తహసీల్దార్ తెలిపారు. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో మట్టి కొట్టుకుని పోయే రైతుల భూములకు నష్టం కలిగించే అవకాశం ఉందని మట్టి తొలగించి క్వారీ చట్రు పోసి పటిష్టం చేసినట్టు రైతులు తెలిపారన్నారు. ఇదే ప్రదేశంలో వెదుళ్లమ్మ బోట్స్ మెన్, సాండ్ వర్కర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ వారు ఇసుక ర్యాంపులో ఉత్పత్తిని పెంచేందుకు ర్యాంపు ఏర్పాటు చేసు కోవడానికి ఇరిగేషన్ ఈఈకి దరఖాస్తు చేసుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ నూతన ఫీడర్ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు.

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని శంకరాపురం రావిమెట్ల, తిమ్మరాజుపాలెం, కోరుమామిడి గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి

కొవ్వూరు: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. ఉదయం పది గంటలకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

పీఆర్‌సీ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

నల్లజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్‌సీ బకాయిలు రూ.22 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరావు డిమాండ్ చేశారు. నల్లజర్లలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను ఆయన పర్యవేక్షించారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతుల్ని వెన్నుపోటు పొడిచిన ఘనత కేంద్రానిదేనన్నారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు ఆయనతో ఉన్నారు.

భగవంతుడికి సేవ చేయటం అదృష్టం


కానూరులో వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వచ్చిన మంత్రి దుర్గేష్‌కి స్వాగతం పలుకుతున్న అర్చకులు

పెరవలి: దేవాలయాల పునప్రతిష్ఠలోను, దేవాలయాల అభివృద్ధి లోను తనకు సేవ చేసే అవకాశం భగవంతుడు కల్పించడం తన అదృష్టమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామివారిని దర్శించుకోగా, ముత్యాలవారిపాలెంలో సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయ పునప్రతిష్ఠ కార్యక్రమం గురువారం పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జన్మలో ఏ పుణ్యం చేశానో తెలియదు కానీ ఈ జన్మలో భగవంతుడి సేవ చేసే భాగ్యం కలిగిందని అందుకు మీ అందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, కొమ్మిశెట్టి కిచ్చు, హనుమంతు సుబ్రహ్మణ్యం, హరిదాసు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

నిడదవోలు రూరల్: గోపవరం గ్రామంలో సర్ల దుర్గా ఆలయం పునర్నిర్మాణానికి గురువారం మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో రూ.30 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నామని సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరుగుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పంచదార దుర్గాప్రసాద్, నాయకులు ఆరేపల్లి చిననంగాలు, అడ్డగర్ల కృష్ణ, పంచదార వెంకన్న, వెలగన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

- గ్రామాల్లో జోరుగా సాగుతున్న అమ్మకాలు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- నియోజక వర్గంలో 19 మద్యం షాపులు బెల్ట్ షాపులు 162


ఖండవల్లిలో మద్యం దుకాణం


ముక్కామల బెల్ట్ షాపులో మద్యం బాటిల్స్

పెరవలి: గ్రామాల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలస్తున్నాయి. సొమ్ము ఇచ్చుకో-బెల్ట్ పెట్టుకో అన్నట్లుగా అధికారులే మామూళ్ల మత్తులో పడి గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులకు అనుమతులు ఇస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికి రెండు నుంచి 5 బెల్ట్ షాపులు వెలస్తున్నాయంటే అధికారులు, ప్రజాప్రతినిధులు అండదండలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ దుకాణాల నిర్వహణకు అధికారులకు ముడుపులు భారీగా చెల్లించుకున్నామని అమ్మకందారులే బహిరంగా చెబుతున్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అధికారిక 19 మద్యం షాపులు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో బెల్ట్ షాపులు వీధికోకటి చొప్పున ఉన్నాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గతంలో షాపు కెళ్లితే కానీ దొరకని మద్యం నేడు ప్రతి బడ్డీకొట్టు దగ్గర లభిస్తోంది. దీంతో మందుబాబులు కుషీ అవ్వుతున్నారు. నియోజకవర్గంలో అధికారికంగా మద్యం షాపులు 19 ఉన్నాయి. వీటిలో పెరవలిలో 5, ఉండ్రాజవరంలో 5 ఉండగా మిగిలిన 9 షాపులు నిడదవోలు రూరల్, టౌన్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 56 గ్రామాలు ఉండగా గ్రామంలో రెండు నుంచి 6 బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. దీంతో నియోజకవర్గంలో అనధికారకంగా సుమారు 162 బెల్ట్ షాపులు ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది.

జోరుగా బెల్ట్ షాపుల్లో అమ్మకాలు

గ్రామాల్లో అనధికారకంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకోవాలంటే అధికారుల జేబులు తడపాల్సి వస్తోంది. ఇందుకోసం బెల్ట్ స్థాయిని బట్టి నెలకు రూ.2 వేలు నుంచి రూ.6 వేలు వరకూ వసూలు చేస్తున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. పెరవలి మండలంలో కానూరు, తీపర్రు, పెరవలి, అన్నవరప్పాడు, ఖండవల్లి గ్రామాల్లో అధికారిక షాపులు ఏర్పాటు చేస్తే మిగిలిన 14 గ్రామాల్లో బెల్ట్ షాపులు గ్రామానికి 2 నుంచి 6 వరకు ఏర్పాటు చేసినట్టు తెలిసింది. వీటి ద్వారా అమ్మకాలు రోజుకి రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు వ్యాపారం జరుగుతుందంటే ఏ స్థాయిలో అమ్మకాలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

అంతా సిండికేటుగా..

మద్యం షాపుల ఏర్పాటు విషయంలోను, దుకాణాల నిర్వహణలో అంతా సిండికేట్‌గా మారినట్టు తెలుస్తోంది. చట్ట పరంగా మద్యం షాపుల వద్దే మద్యం అమ్మకాలు చేయవలసి ఉన్నా షాపుల యజమానులు అమ్మకాలు పెంచుకోవడం కోసం ఎవరికి పడితే వారికి మద్యం ఇచ్చివేయడంతో బెల్ట్ షాపులు కుప్పలు తెప్పలుగా వెలస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. పెరవలి మండలంలో అధికారిక షాపులు 5 ఉంటే మద్యం దుకాణాలు ఉంటే బెల్ట్‌షాపులు 70 వెలిశాయని తెలిసింది. అన్నవరప్పాడులో ఒక మద్యం దుకాణం ఉన్నా మద్యం షాపునకు కూతవేటు దూరంలో ఉన్న అన్నవరప్పాడు సెంటర్‌లో మూడు బెల్ట్ షాపుల ఉన్నాయంటే ఇక్కడ అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఒక బెల్ట్ షాపు రోజుకి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకూ అమ్మకాలు జరుగుతున్నాయంటే ఒక్కడ మద్యం ఏరులై పారుతుందనడంలో ఎటువంటి అతిశయోక్తి కాదేమో. మద్యం షాపులు గ్రామాలకు బయట ఉంటే బెల్ట్ షాపులు మాత్రం గ్రామ నడిబొడ్డున వెలుస్తున్నాయి.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలే

దీనిపై నిడదవోలు ఎక్సైజ్ సీఐ జైరామ్ సతీష్‌ను బెల్ట్ షాపులకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నిస్తే బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతులు లేవని అలా నిర్వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. గ్రామాల్లో విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది వీటిపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నామని వివరించారు.

షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు స్వామివారి కల్యాణం
- మూడు రోజుల పాటు తీర్థం


చినకాశిరేవులో వేంచేసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారు

నిడదవోలు: పట్టణంలో చినకాశిరేవులో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక దర్శనానికి టికెట్ ద్వారా భక్తులను పంపించే ఏర్పాటు చేస్తున్నారు. నిడదవోలు పట్టణంతో పాటు రూరల్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయం వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అనంతరం షష్ఠి సందర్భంగా మూడు రోజుల పాటు తీర్థం నిర్వహించనున్నారు. శనివారం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ చినకాశిరేవులో భక్తులు వేకువజామున గంగా స్నానాలు చేసి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంతో పాటు అయ్యప్ప స్వామి, దుర్గమ్మ ఆలయాలకు కూడా భక్తులు వస్తారు. ఆలయం వద్ద వేకువ జామున 4 గంటల నుంచి భక్తుల తాకిడి మొదలవుతోంది. షష్ఠి రోజున స్వామివారికి భక్తులు ప్రీతికరమైన పూలు, పడగలు, అరటిపండ్లు సమర్పిస్తారు.

మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు

- నలుగురు వ్యక్తుల అరెస్టు
- 66 మద్యం సీసాల స్వాధీనం


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో నిందితులు

దేవరపల్లి: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో మద్యం బెల్ట్ దుకాణాలపై గురువారం అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 66 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నల్లజర్లలో మూడు బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి, 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. గోపాలపురం మండలం దొండపూడిలో బెల్టు దుకాణంపై దాడి చేసి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు. పట్టుకునర్న మద్యం విలువ సుమారు రూ.9500 ఉంటుందని ఆయన తెలిపారు. నవంబర్‌లో 12 మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేసి, రూ.25 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. సారాబట్టీలపై దాడులు చేసి 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు


తాళ్లపూడిలో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీవో


కొవ్వూరు పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్డీవో

తాళ్లపూడి: కొవ్వూరు డివిజన్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఆర్డీవో రాణీ సుష్మిత తెలిపారు. తాళ్లపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 60 మంది ఓటర్లకు గాను 56 మంది 93 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు 22 మంది, పురుషులు 34 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాన్ని కొవ్వూరు ఆర్డీవో రాణీ సుష్మిత పరిశీలించారు. తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎస్సై టి.రామకృష్ణ, కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం తదితరులున్నారు.

పెరవలిలో 98.48 శాతం

పెరవలి: మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 98.48 శాతం ఓట్లు పోలైయ్యాయని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. మండలంలో 66 ఓట్లు ఉండగా 65 ఓట్లు పోలైయ్యాయని పోలింగ్ ప్రశాంతగా నిర్వహించామని పోలైన ఓట్లలో పురుషులు 44, స్త్రీలు 21 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

దేవరపల్లిలో 97.77 శాతం

దేవరపల్లి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం దేవరపల్లి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవరపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో 90 మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉండగా, 88 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 97.77 శాతం ఓట్లు పోలైనట్టు మండల రెవెన్యూ అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. పోలింగ్ ప్రక్రియను తహసీల్దార్ పరిశీలించారు. గోపాలపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ అల్లూరి బాపిరాజు సందర్శించి, పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

నల్లజర్లలో 95 శాతం

నల్లజర్ల: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నల్లజర్లలో 95 శాతం పోలింగ్ జరిగినట్టు తహసీల్దారు కృష్ణారావు తెలిపారు. మండలంలో 139ఓట్లకు ఉండగా 132 ఓట్లు పోలైనట్టు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు ఆయన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మనోహరకుమార్, నల్లజర్ల భవాని, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆలీ అహమ్మద్, బి.కిశోర్, ఐవీ సత్యం, కామేశ్వరావు పాల్గొన్నారు.


చాగల్లులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు


కొవ్వూరు పోలింగ్ స్టేషన్‌లో ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు

కొవ్వూరులో 89.69 శాతం

కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 85వ పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 233 మందికి గాను 209 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనిలో పురుష ఓటర్లు 120 మంది, 89 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 89.69 శాతం పోలింగ్ నమోదైంది. ఆర్డీవో రాణీ సుస్మిత పోలింగ్ సరళిని పరిశీలించారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆమె వెంట ఉన్నారు. పోలింగ్ అనంతరం ప్రత్యేక వాహనంలో పోలింగ్ ఎస్కార్ట్‌తో బ్యాలెట్ బాక్సులను రాజమహేంద్ర వరం ఆర్ట్స్ కళాశాలకు తరలించారు.

ఉండ్రాజవరంలో 94 శాతం

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 125 ఓట్లుకు గాను 117 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. అందులో పురుషులు 66 మంది, మహిళలు 51 మంది ఉన్నారు. పోలింగ్ శాంతం 94 శాతం నమోదయ్యింది. ఈ ప్రక్రియను తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు తదితరులు పరిశీలించారు.

నిడదవోలులో..

నిడదవోలు: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. నిడదవోలు పట్టణం, మండల పరిధిలో 204 ఓటర్లకు గాను 190 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, పట్టణ ఎస్సై టి.శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.నాగరాజు నాయక్ ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

చాగల్లులో 93.1 శాతం

చాగల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. బూత్ నంబర్ 84 లో 58 మందికి గాను 54 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 36 మంది, మహిళలు 18 మంది ఓటు వేశారు. పోలింగ్ 93.1 శాతం నమోదయ్యిందని తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బారాజు పరిశీలించారు.


దేవరపల్లిలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్


నిడదవోలు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఉపాధ్యాయులు

పది నుంచి రెవెన్యూ గ్రామసభలు

కొవ్వూరు: రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి ఈ నెల పదో తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. దొమ్మేరు గ్రామ సచివాలయం వద్ద కాపవరం, దొమ్మేరు-1, 2 సచివాలయ పరిధిలో రైతులకు, 11న నందమూరులో గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. 12న కొవ్వూరు పట్టణంలో ఉన్న పది సచివాలయాలకు సంబంధించిన ప్రజలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద సభ జరుగుతుందన్నారు. 13న పెనకనమెట్టలోను, 17న పశివేదల లోను, 18న తొగుమ్మి, 19న చిగుల్లాంకకి సంబంధించి మద్దూరు లంక, సీతంపేట గ్రామాలకు సీతంపేట సచివాలయంలోను, 20న కుమారదేవం, 24న ధర్మవరం, 26న ఐ.పంగిడి, 27న దేచెర్ల, 31న వేములూరు, జనవరి రెండో తేదీన వాడపల్లి, మూడున మద్దూరు, ఏడో తేదీన చిడిపి, జనవరి ఎనిమిదో తేదీన ఆరికిరేవుల గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

పశుగ్రాస సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

చాగల్లు: బహు వార్షిక పశుగ్రాసాల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.ముఖేష్ తెలిపారు. చాగల్లులో గురువారం ఆయన మాట్లాడుతూ బహు వార్షిక పశుగ్రాసాల సాగుకు 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. నిర్ణీత పొలంలో దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, ఎరువుల కోసం ఆర్థిక ప్రోత్సాహం ప్రభుత్వమే అందిస్తుందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆర్థిక సంవత్సరంలో పశుగ్రాసం పెంచడానికి వంద రోజుల పనిదినాలు కల్పిస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు ఆధార్, జాబ్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పొలం-1బీ ఫారం, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్ కార్డు జిరాక్స్‌లను గ్రామసభ తీర్మానంతో అందించాలి. మరిన్ని వివరాలకు ఉపాధి హామీ కార్యాలయం లేదా రైతు సేవా కేంద్రం వద్ద సంప్రదించవచ్చునని తెలిపారు.

మాజీ మంత్రి వనిత పరామర్శ


అనంతపల్లిలో మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: అనంతపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ యూత్ కార్యకర్త కోటి అఖిల్‌సింహ(బన్ను)కుటుంబ సభ్యులను మాజీ మంత్రి తానేటి వనిత గురువారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బన్ను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట నాయకులు బంక అప్పారావు, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, బళ్లనాని, ప్రత్తి మురళీకృష్ణ, గనిబాబు తదితరులున్నారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి గాయపడిన మాజీ ఎంపీటీసీ వీరమళ్ల వెంకటేశ్వరావును కూడా వనిత పరామర్శించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

రాజమహేంద్రవరం రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలని రైతులకు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. రాజవోలు గ్రామంలో వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం గురువారంతో ముగిసింది. చివరి రోజు రైతు సదస్సు - రైతు శాస్త్రవేత్తల చర్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన రాజవోలు రైతులకు మిని కిట్ల ద్వారా వరి విత్తనాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. వివిధ పంటల సాగుపై శాస్త్రవేత్తలు చేసిన సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

రైతు సదస్సులో భాగంగా విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ లైట్ ట్రాప్, టెర్రస్ గార్డెన్, సమీకృత వ్యవసాయం, వర్షం నీటి సేకరణ, సమగ్ర సస్యరక్షణ, గ్రీన్ హౌస్, ఎర తెర పద్ధతి, బయో గ్యాస్, డ్రిప్ ఇరిగేషన్, రైతు సేవా కేంద్రం, అంతర పంటలు, వర్మీ కంపోస్టు, తుంపర సేద్యం, పట్టు పురుగుల పెంపకం, మురికి నీటిశుద్ధి విధానం, అజోల్లా పెంపకం, తేమ సంరక్షణ పద్ధతులు, వర్టికల్ హైడ్రానిక్స్‌పై నమూనాలను ప్రదర్శించారు.